కార్పొరేట్‌కు దీటుగా ఫలితాలు

- పదిలో ప్రభుత్వ పాఠశాలలదే హవా..
- ప్రతిభావంతులకు ప్రోత్సాహకాలు



పాఠశాల టాపర్ అంజలితోపాటు ఉపాధ్యాయినులను అభినందిస్తున్న ఎంఈవోలు

నర్సీపట్నం: పదవ తరగతి పరీక్షల్లో అత్యధిక మార్కులు సాధించిన విద్యార్థులకు ఎంఈవోలు సిహెచ్.తలుపులు, జి.వి.ఎస్.నాగేంద్ర ప్రోత్సాహకాలు అందజేశారు. మంగళవారం స్థానిక జెడ్పీ గర్ల్స్ హైస్కూల్‌లో ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఏపీ మోడల్ స్కూల్ విద్యార్థిని వి.వైశాలి దేవి 587, గర్ల్స్ హైస్కూల్ నుంచి అడిగర్ల లక్ష్మణ కుమారి 586 మార్కులు సాధించారు. ప్రైవేట్ స్కూల్ నుంచి 594 మార్కులు సాధించిన కోన భవితేజ్ ప్రోత్సాహకాలు అందజేశారు. హెచ్ఎం మాధవి, ఉపాధ్యాయులు బాబూరావు, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

కె.కోటపాడు: కింతాడ కేజీబీవీలో పదో తరగతిలో శతశాతం ఉత్తీర్ణత సాధించడం అభినందనీయమని ఎంఈవో- 1, 2 సత్యనారాయణ, డీవీడీ ప్రసాద్ తెలిపారు. పది ఫలితాల్లో 540 మార్కులతో పాఠశాల టాపర్‌గా నిలిచిన అంజలిని, ప్రిన్సిపాల్ బి.చిన్నమ్ములును వీరు అభినందించారు.

రోలుగుంట: స్థానిక బీసీ బాలుర వసతి గృహం నుంచి పది పరీక్షల్లో శతశాతం ఉత్తీర్ణత సాధించినట్టు వార్డెన్ హరిగోపాల్ తెలిపారు. తమ హాస్టల్ నుంచి 30 మంది పరీక్షలకు హాజరు కాగా, మొత్తం పాసయ్యారన్నారు. తాను ఏర్పాటు చేసిన ట్యూటర్లు అందించిన ఉత్తమ బోధన ఎంతో మేలు చేసిందని ఆనందం వ్యక్తం చేశారు.

కేజీబీవీలో 18 మందికి 500పైగా మార్కులు

మాడుగుల: స్థానిక కేజీబీవీలో 40 మంది విద్యార్థినులకుగాను 39 మంది ఉత్తీర్ణత సాధించారు. 18 మందికి 500పైగా మార్కులు వచ్చాయి. మ్యాథ్స్‌లో అందరికి 90 మార్కులు దాటి వచ్చాయని ఎస్‌వో విజయ తెలిపారు. గొటివాడకు చెందిన జ్యోతి 559 మార్కులతో పాఠశాల టాపర్‌గా నిలవడంతో అభినందించారు.



మాడుగుల కేజీబీవీలో విద్యార్థినులను అభినందిస్తున్న ఎస్‌వో విజయ, ఉపాధ్యాయినులు

గతేడాది కంటే పెరిగిన ఉత్తీర్ణత శాతం

మాడుగుల రూరల్: మండలంలో 751 మందికి 670 మంది పాసై 89 శాతం మేర ఉత్తీర్ణత సాధించారు. తెలుగు మాధ్యమంలో 351 మందికిగాను 293 మంది, ఆంగ్ల మాధ్యమంలో 395 మందికి 377 మంది పాసయ్యారు. గతేడాది 79 శాతం ఉత్తీర్ణత సాధించగా, ఈ ఏడాది 89 శాతం పెరిగిందని ఎంఈవోలు పాండురంగారావు, దేముడమ్మ మంగళవారం తెలిపారు. కె.జె.పురం జెడ్పీ హైస్కూలులో పదిలో 583 మార్కులు సాధించిన ఆళ్ల ఉదయశ్రీని హెచ్ఎం వి. దాసు ఆధ్వర్యంలో అభినందించారు. పేరెంట్స్ కమిటీ చైర్మన్ మళ్ల కిశోర్, హెచ్ఎం దాసు, సీఆర్పీ ఎన్. సంధ్య, ఉపాధ్యాయులు, స్కూలు కమిటీ సభ్యులు అభినందించారు.

మండల టాపర్లకు అభినందన

నాతవరం: మండలంలో పదో తరగతిలో మండల స్థాయిలో ఉత్తమ ర్యాంకులు సాధించిన విద్యార్థులకు మంగళవారం స్థానిక హైస్కూల్‌లో అభినందన సభ ఏర్పాటు చేశారు. నాతవరం హైస్కూల్ నుంచి గొంప రోహిణి, డి.యర్రవరం నుంచి బోత్సా యామిని, నాతవరం నుంచి వి.యశ్వంత్ మొదటి మూడు స్థానాల్లో నిలిచారు. వీరిని ఎంపీడీవో జాగరపు రాంబాబు, ఎంఈవో తాడి అమృత్ కుమార్ ఘనంగా సత్కరించి అభినందించారు. ఉపాధ్యాయులు పాల్గొన్నారు.



ప్రతిభ చూపిన విద్యార్థులకు అభినందన



నర్సీపట్నం: ఉత్తమ విద్యార్థులకు ప్రోత్సాహకాలు అందజేస్తున్న ఎంఈవో తలుపులు, నాగేంద్ర



కె.జె.పురంలో ఉదయశ్రీని అభినందిస్తున్న హెచ్ఎం దాసు, ఉపాధ్యాయులు

సత్తా చాటిన ఎంజేపీ బీసీ బాలికల పాఠశాల

చోడవరం రూరల్: పదో తరగతి పరీక్ష ఫలితాల సాధనలో మహాత్మా జ్యోతిబా పూలే బీసీ బాలికల పాఠశాల సత్తా చాటింది. శతశాతం ఉత్తీర్ణతను సాధించడమే గాకుండా ఇదే పాఠశాల విద్యార్థినులు కర్రి ధనలక్ష్మి 588, మధుమంతి స్వాతి 585 మార్కులు సాధించి మండల స్థాయిలో ప్రథమ, ద్వితీయ స్థానాలను కైవసం చేసుకున్నారు. ఎంఈవో జయలక్ష్మి వివరాల ప్రకారం.. ఈ పాఠశాల నుంచి పరీక్షలకు హాజరైన 30 మందికిగాను శత శాతం ఉత్తీర్ణత సాధించారు. పట్టణంలోని జెడ్పీ బాలికోన్నత పాఠశాల విద్యార్థిని ఎం.నేహ 579 మార్కులతో మండలంలో తృతీయ స్థానంలో నిలిచింది. మండలంలోని 14 ప్రభుత్వ పాఠశాలల నుంచి 756 మంది పది పరీక్షలు రాయగా 678 మంది ఉత్తీర్ణులయ్యారు. మొత్తం 89.4 శాతం ఉత్తీర్ణత నమోదయ్యింది. లక్ష్మీపురం జెడ్పీ ఉన్నత పాఠశాల నుంచి 109 మందికి 104 మంది పాసయ్యారు. ఇక్కడ ఇంగ్లిషు మీడియం విద్యార్థుల శత శాతం ఉత్తీర్ణులు కావడం విశేషం. లక్కవరం నుంచి 53 మందికి గాను 50, గవరవరం నుంచి 29మందికి గాను 26, జుత్తాడ నుంచి 24కు 22 మంది, చోడవరం బాలికోన్నత పాఠశాల నుంచి 106 మందికి 89 మంది ఉత్తీర్ణులయ్యారు. కేజీబీవీ నుంచి 38 మందికి 36, ప్రభుత్వ ఉన్నత పాఠశాల నుంచి 85 మందికి 74, గౌరీపట్నం పాఠశాల నుంచి 28కి 25, గోవాడ నుంచి 106కు 89, ముద్దుర్తి పాఠశాల నుంచి 30కి 26, పి.ఎస్.పేట నుంచి 50కి 45, జన్నవరం నుంచి 44కు 39 మంది పాసయ్యారు. మరో పది ప్రైవేటు సంస్థల పాఠశాలల నుంచి 351 మంది పరీక్షలు రాయగా, 348 మంది పాసై 99 శాతం ఉత్తీర్ణత సాధించారు. రెండు పాఠశాలల విద్యార్థులిద్దరూ 592 మార్కులను సాధించగా, ఏడు పాఠశాలలు శత శాతం ఉత్తీర్ణత సాధించాయి.



ప్రతిభ విద్యార్థులను అభినందిస్తున్న ఎంపీడీవో రాంబాబు, ఎంఈవో అమృత్‌కుమార్



ధనలక్ష్మి(588) స్వాతి(585) నేహ(579)

ప్రతిభ చూపిన ప్రేమసమాజం పిల్లలు

చోడవరం రూరల్: స్థానిక ప్రేమసమాజంలో ఉంటూ ప్రభుత్వ పాఠశాలలో విద్యాభ్యాసం చేసిన విద్యార్థులు పదో తరగతి పరీక్షలో ప్రతిభ చాటారు. విద్యార్థులు తురాయి రవికుమార్ - 532 మార్కులు, బి.హరీష్ -500, చిక్కుడు గణేష్ -437, కచ్చల్ల సతీష్ 351 మార్కులు సాధించారు. వీరిని సాకేత్ ఫౌండేషన్, సంస్కార భారతి ఆధ్వర్యంలో సత్కరించి జ్ఞాపికలు అందజేశారు. ప్రేమ సమాజం కార్యదర్శి ప్రసాదరాజు, ట్యూటర్ శివ సుబ్రహ్మణ్యంలను సంస్థ ప్రతినిధులు డి.ఎస్.ప్రసాద్, ప్రకాష్, సూర్యనారాయణ, టి..వి.రమణ, కొండలరావు, మణికంఠ అభినందించారు.

జగనన్న పాలనతోనే రైతులకు మేలు

చోడవరం ఎమ్మెల్యే అభ్యర్థి కరణం ధర్మశ్రీ



ఎల్.బి.పురంలో ఉపాధి కూలీలతో మాట్లాడుతున్న విప్ ధర్మశ్రీ

బుచ్చెయ్యపేట: వ్యవసాయ రంగం అభివృద్ధి చెంది రైతాంగం బాగుపడాలంటే ముఖ్యమంత్రిగా జగనన్నను రెండోసారి అధికారంలోకి వచ్చేలా ఫ్యాన్ గుర్తుకే ఓటు వేసి గెలిపించాలని ప్రభుత్వ విప్, చోడవరం ఎమ్మెల్యే అభ్యర్థి కరణం ధర్మశ్రీ కోరారు. మంగళవారం ఎల్.బి.పురంలో పార్టీ మండల నాయకులతో కలిసి ఆయన ఎన్నికల ప్రచారం చేపట్టారు. టీడీపీ దుష్టపాలనలో ప్రకృతి కరుణించేది కాదన్నారు. దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖర్‌రెడ్డి ఆయన కుమారుడు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాలనలో ప్రకృతి కరుణించి సమృద్ధిగా వర్షాలు కురిసి పాడి పంటలు పుష్కలంగా పండుతున్నాయన్నారు. ముఖ్యమంత్రి జగనన్న పది సెంట్లు భూమి ఉన్న రైతుకు రైతు భరోసా అందించడమే కాక గ్రామాల్లోనే రైతు భరోసా కేంద్రాలు ఏర్పాటు చేసి మండల కేంద్రాల చుట్టూ విత్తనాలు, ఎరువులు కోసం కాళ్లరిగేలా తిరిగే పరిస్థితులు లేకుండా చేశారన్నారు. అప్పులు ఊబిలో కూరుకుపోయిన గోవాడ సుగర్ ఫ్యాక్టరీకి ముఖ్యమంత్రిని కోరి నిధులు తీసుకొచ్చి రైతాంగాన్ని ఆదుకున్నామన్నారు. రైతులకు సున్నా వడ్డీ రుణాలతోపాటు సబ్సిడీపై పరికరాలు, రాయితీలు అందించి రైతు సంక్షేమమే ధ్యేయంగా పని చేస్తున్న వైఎస్సార్‌సీపీని వచ్చే నెల ఎన్నికల్లో అఖండ మెజార్టీతో గెలిపించాలని కోరారు. జెడ్పీటీసీ దొండా రాంబాబు, పార్టీ మండలాధ్యక్షుడు కె. అచ్చింనాయుడు, డీసీసీబీ మాజీ డైరెక్టర్ కోవెల జనార్దన రావు, వైస్ ఎంపీపీ దొండా లలితా నారాయణమూర్తి, సర్పంచ్ తమరాన శ్రీను, నాయకులు ఆర్జీసీ రమణ, మెల్లి శ్రీను, పినబోయిన గంగయ్య, నంబారు అప్పారావు పాల్గొన్నారు.

తురకలపూడి, గవరపాలెం వలంటీర్ల రాజీనామా



పంచాయతీ కార్యదర్శికి రాజీనామా పత్రాలను అందిస్తున్న వలంటీర్లు



రాజీనామా చేసిన తురకలపూడి వలంటీర్లు

బుచ్చెయ్యపేట/కె.కోటపాడు: బుచ్చెయ్యపేట మండలం తురకలపూడి నుంచి 12 మంది గ్రామ వలంటీర్లు తమ బాధ్యతలకు మంగళవారం రాజీనామా చేశారు. రాజీనామా పత్రాలను గ్రామ సెక్రటరీ ద్వారా ఎంపీడీవో వెంకటాచార్యకు అందించారు. సర్పంచ్ గోవింద, మాజీ సర్పంచ్ గంట్ల అప్పలనాయుడు, కోఆపరేటివ్ అధ్యక్షుడు నాగభూషణం, నాయకులు కోరుకొండ అప్పలనాయుడు, కాసులను కలిసి ఇకపై ప్రత్యక్ష రాజకీయాల్లోకి వచ్చి సీఎం జగనన్న గెలుపు కోసం పాటు పడతామన్నారు. కె.కోటపాడు మండలం గవరపాలెం నుంచి ఐదుగురు వలంటీర్లు రాజీనామా చేసి పంచాయతీ కార్యదర్శి రమేష్‌కు అందించారు. మాడుగుల ఎమ్మెల్యేగా ఈర్లె అనురాధ, ఎంపీగా బూడి ముత్యాలనాయుడులను గెలిపించుకునేందుకు పని చేయనున్నట్లు తెలిపారు.

క్లుప్తంగా

ధర్మశ్రీ కుమార్తె స్వాతి విస్తృత ప్రచారం



మరుపాకలో వేతనదారులతో మాట్లాడుతున్న స్వాతి

రావికమతం: ప్రభుత్వ విప్, వైఎస్సార్‌సీపీ చోడవరం ఎమ్మెల్యే అభ్యర్థి కరణం ధర్మశ్రీ కుమార్తె స్వాతి మండలంలో విస్తృత ప్రచారం చేశారు. మంగళవారం ఆమె మరుపాక శివారులో చెరువు పనులు చేస్తున్న ఉపాధి కూలీలతో మాట్లాడారు. అన్ని పథకాలు ఇంటింటికీ ఇస్తున్న జగనన్నను మళ్లీ ముఖ్యమంత్రిగా గెలిపించుకోవాలని కోరారు. నియోజకవర్గ అభివృద్ధికి పాటుపడుతున్న ధర్మశ్రీకి ఫ్యాన్ గుర్తుపై ఓటేసి గెలిపించాలని అభ్యర్థించారు. స్థానిక నాయకుడు పండూరి సత్తిబాబు, పాల్గొన్నారు.

ధర్మశ్రీ నామినేషన్ కార్యక్రమానికి తరలిరండి

చోడవరం: వైఎస్సార్‌సీపీ అభ్యర్థి కరణం ధర్మశ్రీ బుధవారం ఉదయం 9 గంటలకు చోడవరంలో నామినేషన్ వేయనున్నారు. పార్టీ నాయకులు, కార్యకర్తలు అభిమానులతో గాంధీ గ్రామం హైస్కూల్ గ్రౌండు నుంచి భారీ ర్యాలీగా వచ్చి తహసీల్దార్ కార్యాలయం వద్ద ఆయన నామినేషన్ దాఖలు చేస్తారు. చోడవరం, బుచ్చెయ్యపేట, రావికమతం, రోలుగుంట మండలాల నుంచి వేలాదిగా కార్యకర్తలు, అభిమానులు, పార్టీ శ్రేణులు తరలి రావాలని ధర్మశ్రీ పిలుపునిచ్చారు.

మనసారా ఓటుతో దీవించాలి

- కింతాడ, కె.కోటపాడు గ్రామాల్లో వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి అనురాధ ఎన్నికల ప్రచారం



మహిళలకు కరపత్రాలను అందిస్తున్న అనురాధ

కె.కోటపాడు: ఐదేళ్లలో వివక్ష లేకుండా ప్రజలకు సీఎం జగన్‌మోహన్‌రెడ్డి సుపరిపాలన అందించారని వైఎస్సార్‌సీపీ మాడుగుల ఎమ్మెల్యే అభ్యర్థి ఈర్లె అనురాధ అన్నారు. కె.కోటపాడు, కింతాడ గ్రామాల్లో మంగళవారం ఆమె ఎన్నికల ప్రచారాన్ని నిర్వహించారు. మండుటెండను సైతం లెక్క చేయకుండా ఓటర్లను కలిశారు. ఉపాధి వేతనదారులకు కలిసిన ఆమె ఎంపీ, ఎమ్మెల్యే అభ్యర్థులైన తనకు, తన తండ్రి బూడి ముత్యాలనాయుడుకు రెండు ఓట్లను ఫ్యాన్ గుర్తుకు వేయాలని అభ్యర్థించారు. సీఎం జగన్‌మోహన్‌రెడ్డి సచివాలయ, వలంటీర్ వ్యవస్థను ఏర్పాటు చేసిన తర్వాత గ్రామాల్లోనే పౌర సేవలు అందుతున్నాయన్నారు. గత తెలుగుదేశం పార్టీ పాలనలో జన్మభూమి కమిటీల వల్ల ప్రజలు ఎదుర్కొన్న కష్టాలు వైఎస్సార్‌సీపీ పాలనలో లేవన్నారు. సీఎం జగన్ ప్రభుత్వం ద్వారా అందించిన సంక్షేమంతో పేద కుటుంబాల్లో ఆర్థిక వెలుగులు నిండాయన్నారు. మంచి చేస్తున్న సీఎం జగన్‌ను మరో మారు ప్రజలు ఓటుతో ఆశీర్వదించాలని కోరారు. రాబోయే సీఎం జగన్ పాలనలో ఉపాధి వేతనదారులకు మరింత మంచి జరగనున్నట్లు తెలిపారు. ఎంపీపీ రెడ్డి జగన్‌మోహన్, ఉప సర్పంచ్ రెడ్డి అరుణ, సర్పంచ్ బండారు ముత్యాలనాయుడు, శ్రీకాంత్ శ్రీను, డోకల అప్పలనాయుడు పాల్గొన్నారు.

ఘనంగా పెద్దరాయి (ధర్మపీఠం) పండగ



కలశాలతో వేపచెట్టు వద్ద ప్రదక్షిణ చేస్తున్న భక్తులు

రావికమతం: చినపాచిలలో న్యాయదేవతగా పేరొందిన ధర్మపీఠం(పెద్దరాయి) పండగను మంగళవారం ఘనంగా నిర్వహించారు. పెద్దరాయికి, చల్లగ చూసే వేపచెట్టుకు పసుపునీళ్లతో అభిషేకం చేశారు. దేవుడి గుడిలో నైనా అబద్ధం చెబుతారేమో కానీ చినపాచిల పెద్దరాయిపై నిలబడి ఎవ్వరూ చెప్పరు. ఎన్నో తగవులను తీర్చిన ధర్మపీఠాన్ని గ్రామస్తులు దేవతగా కొలుస్తుంటారు. అంతటి మహిమ గల పెద్దరాయిపై కలశాలతో తీసుకొచ్చిన పసుపునీళ్లు పోసి పూజలు చేశారు.

మానసిక వికాసానికి పుస్తకం

చోడవరం రూరల్: మానసిక వికాసానికి పుస్తకం, ఆర్థికంగా ఎదుగుదలకు ఆంగ్లభాష ఎంతగానో ఉపకరిస్తాయని వైస్ ప్రిన్సిపాల్ పి.కిరణ్‌కుమార్ తెలిపారు. మంగళవారం స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో పుస్తక, ఆంగ్ల భాషా దినోత్సవాలను ఘనంగా నిర్వహించారు. పుస్తక పఠనం, ఆంగ్ల భాషల ఔచిత్యాన్ని ఈ సందర్భంగా ఆయన తెలియజేశారు. లెక్చరర్లు ఐ.వి.వి. సత్యవతి, జ్యోతి, ఎన్ఎస్ఎస్ పీవో బి.పిచ్చమ్మ, తదితరులు పాల్గొన్నారు.

కోలాహలంగా గణేష్ నామినేషన్

- నేను గెలిస్తే ఒక్కడినే ఎమ్మెల్యే
- అయ్యన్నపాత్రుడు గెలిస్తే నలుగురు ఎమ్మెల్యేలు
- మరోసారి అవకాశం ఇవ్వండి అభివృద్ధి చేసి చూపిస్తా



ర్యాలీలో ప్రత్యేక రథంపై నుంచి ప్రజలకు అభివాదం చేస్తున్న ఎమ్మెల్యే గణేష్



నాతవరం నుంచి బైక్ ర్యాలీగా వస్తున్న పార్టీ కార్యకర్తలు

నర్సీపట్నం: తాను గెలిస్తే ఒక్కడినే ఎమ్మెల్యేను.. నా భార్య, పిల్లలకు రాజకీయాల్లో జోక్యం ఉండదు.. పొరపాటున అయ్యన్నపాత్రుడు గెలిస్తే నలుగురు ఎమ్మెల్యేలు పాలిస్తారని వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి పెట్ల ఉమాశంకర్ గణేష్ తెలిపారు. మధ్యవర్తులు, పైరవీలు లేకుండా నేరుగా తనను కలిసి సమస్యలను పరిష్కరించుకోవచ్చన్నారు. అదే అయ్యన్నపాత్రుడుని కలవాలంటే ఆయన సతీమణి, ఇద్దరు కొడుకులు ఆశీస్సు ఉండాలన్నారు. మంగళవారం నర్సీపట్నంలో వైఎస్సార్‌సీపీ అభ్యర్థి పెట్ల ఉమాశంకర్ గణేష్, ఎంపీ అభ్యర్థి బూడి ముత్యాలనాయుడుతో కలిసి నామినేషన్ వేశారు. ఆరు వేల భారీ బైక్ ర్యాలీ నడుమ గణేష్ నామినేషన్ అట్టహాసంగా జరిగింది. భారీ బైక్ ర్యాలీ నడుమ ప్రత్యేక వాహనంలో ఎమ్మెల్యే గణేష్, ముఖ్య నాయకులు చింతకాయల సన్యాసిపాత్రుడు, రుత్తల యర్రాపాత్రుడు, బోళెం నర్సింహమూర్తి, డాక్టర్ లక్ష్మీకాంత్, ఏఎంసీ చైర్మన్ చిటికెల భాస్కర్‌నాయుడు, మున్సిపల్ వైస్ చైర్మన్లు కోనేటి రామకృష్ణ, తమరాన అప్పలనాయుడులతో కలిసి నామినేషన్ కార్యక్రమానికి తరలివెళ్లారు. ప్రత్యేక వాహనంలో ఎమ్మెల్యే ప్రజలకు అభివాదం చేసుకుంటూ ముందుకు సాగారు. బైక్ ర్యాలీ క్యాంపు కార్యాలయం నుంచి పెదబొడ్డేపల్లి జంక్షన్, శ్రీకన్య కూడలి, వై.జంక్షన్, పెద్దచెరువు, ఐదు రోడ్ల జంక్షన్ మీదుగా సుమారు మూడున్నర కిలోమీటర్ల పొడవున నిర్వహించారు.

అబిద్‌సెంటర్‌లో ర్యాలీని ఉద్దేశించి గణేష్ మాట్లాడుతూ అయ్యన్నపాత్రుడుకు ఓటేస్తే కొడుకు విజయ్ రౌడీయిజంతో నర్సీపట్నం సర్వనాశనమవుతుందన్నారు. వారిద్దరూ గత టీడీపీ ప్రభుత్వంలో లేట్‌రైట్, రంగురాళ్ల వ్యాపారులను బెదిరించి వేల కోట్లు దోచుకున్నారని దుయ్యబట్టారు. మళ్లీ అయ్యన్నపాత్రుడు వస్తే అదే పరిస్థితి ఉంటుందన్నారు. గత ఎన్నికల్లో తాను ఇచ్చిన మాట ప్రకారం ఎమ్మెల్యేగా ఎక్కడ రౌడీ రాజకీయాలు చేయలేదన్నారు. నియోజవర్గంలో ప్రతి కుటుంబాన్ని సంక్షేమ పథకాల ద్వారా లక్షాధికారులను చేశామన్నారు. మున్సిపాలిటీ వాసులకు ఇచ్చిన మాట ప్రకారం టీడీపీ ప్రభుత్వంలో పెంచిన ఇంటి పన్నులను 25 శాతం తగ్గించిన ఘనత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వానిదే అన్నారు. రూ.1,700 కోట్లతో నియోజకవర్గాన్ని అభివృద్ధి చేశానన్నారు. నియోజకవర్గానికి రూ.500 కోట్లతో మెడికల్ కళాశాల తీసుకువచ్చాన్నారు. రూ.6 కోట్లతో కొత్తవీధి చెరువును వైఎస్సార్ ట్యాంక్ బండ్‌గా తీర్చిదిద్దానన్నారు. రోడ్డు నిర్మాణం 75 శాతం పూర్తి చేశామన్నారు. మెయిన్ రోడ్డు విస్తరణకు అయ్యన్నపాత్రుడు అడ్డంకులు సృష్టించటం వల్ల జాప్యమైందన్నారు. ఆరిలోవ రోడ్డు విస్తరణకు అనుమతులు తీసుకురాలేక కురువృద్ధుడు చేతులెత్తేస్తే తాను తీసుకొచ్చి పనులు చేట్టానన్నారు. గత ఎన్నికల్లో తాను ఎలాంటి హామీ ఇవ్వకుండానే ఈ పనులన్నీ చేశానన్నారు. 30 వేల ఓట్ల మెజార్టీతో వైఎస్సార్‌సీపీ జెండా ఎగురుతుందన్నారు. ఎంపీగా ముత్యాలనాయుడు లక్ష ఓట్లతో మెజార్టీతో విజయం సాధిస్తారని ధీమా వ్యక్తం చేశారు. మరోసారి ఆశీర్వదించండి నర్సీపట్నంను మోడల్‌గా తీర్చిదిద్దుతానన్నారు. అనంతరం ఎంపీ అభ్యర్థి ముత్యాలనాయుడుతో కలిసి ఎన్నికల రిటర్నింగ్ అధికారి హెచ్.వి.జయరాంకు నామినేషన్ పత్రాలు అందజేశారు. నామినేషన్ కార్యక్రమంలో గొలుగొండ, నాతవరం, మాకవరపాలెం, నర్సీపట్నం మండలం, మున్సిపాలిటీ నుంచి తరలివచ్చిన వేలాది మంది పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ఎమ్మెల్యే అభ్యర్థిగా కళావతి నామినేషన్

వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి పెట్ల ఉమాశంకర్ గణేష్ సతీమణి కళావతి మంగళవారం నామినేషన్ వేశారు. వైఎస్సార్‌సీపీ నుంచి ఆమె నామినేషన్ వేశారు. మున్సిపల్ వైస్ చైర్మన్ కోనేటి రామకృష్ణ, ఏఎంసీ చైర్మన్ చిటికెల భాస్కర్‌నాయుడు, పార్టీ సీనియర్ నాయకుడు బోళెం నర్సింహమూర్తితో కలిసి ఆర్వో హెచ్.వి.జయరాంకు నామినేషన్ సమర్పించారు.